



# కరపత్రం

SINCE 2014

ఆదివారం డిసెంబర్ 8 2024 | సంపుటి :0 | సంచిక : 60 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే నాకు స్ఫూర్తి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మబలిదానాలు, ఆకాంక్షలు, ఆశయాలను అన్నింటినీ కలిపి వీలునామాగా రాసి డిసెంబర్ 7, 2023 నాడు తెలంగాణ తన చేతుల్లో పెట్టిందన్నారు. వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను రాష్ట్రం అప్పగించిందని చెప్పారు.

"ఆ క్షణం నుంచి జన సేవకుడిగా, ప్రజా సంక్షేమ శ్రామికుడిగా..
మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో.. సకల జనహితమే పరమావధిగా..
జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా..
సహచరుల సహకారంతో.. జనహితుల ప్రోత్సాహంతో..
విమర్శలను సహిస్తూ.. విద్వేషాలను ఎదిరిస్తూ.. స్వేచ్ఛకు రెక్కలు తొడిగి..
ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచి..
అవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకు..
గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ.. నాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూ..
నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా...
విరామం ఎరగక విశ్రాంతి కోరక ముందుకు సాగిపోతున్నాను.
ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి...
సమస్త ప్రజల ఆకాంక్షలు సంపూర్ణంగా నెరవేర్చడమే నా సంప్రాప్తి"

అని రేవంత్‌రెడ్డి పోస్టు చేశారు.



# ప్రజాపాలన విజయోత్సవాలు..
## గవర్నర్, కేసీఆర్, కిషన్‌రెడ్డికి ఆహ్వానం





హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు. కేసీఆర్‌ను కలిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపంపై కేసీఆర్‌తో ఎలాంటి చర్చ జరగలేదన్నారు. ప్రభుత్వం తరఫున మర్యాదపూర్వకంగా ఆహ్వానించామని, వస్తారో లేదో ఆయన ఇష్టమని మంత్రి వ్యాఖ్యానించారు.

# రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా?: హరీశ్‌రావు



- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.
- నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు పెడుతున్నారని విమర్శించారు.
- గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాము అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంటును మారుస్తామన్నారని.. ఇప్పుడేమో మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్

4లో

# ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు: డిప్యూటీ సీఎం భట్టి

**మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.**



హైదరాబాద్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి.. అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

# వేములవాడలో కోడెల విక్రయం.. వార్తలు అవాస్తవం:

**వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు.**



వేములవాడ: ప్రభుత్వంపై బురదజల్లే రీతిలో కుట్రపూరితంగా ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను ఆమె ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో వేములవాడ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో, వాటిలో కొన్ని మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మొక్కుల రూపంలో భక్తులు స్వామికి సమర్పించిన కోడెల నిర్వహణకు విధివిధానాలను రూపొందించేందుకు మే నెలలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, వేములవాడ ఆలయ ఈవో కన్వీనర్‌గా, పలువురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు.

4లో

# అధికారం మాత్రమే పోయింది..
## బీఆర్ఎస్‌పై ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదు : కేటీఆర్

**ఈ ఏడాది పాలనలోనే తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మనసు విరిగిందని, మళ్లీ అధికారం కేసీఆర్‌కే దక్కుతుందని ఓ సర్వే ప్రతినిధి చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.**

**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.**



ఇవాళ నా వద్దకు ఓ సర్వే ప్రతినిధి వచ్చి.. ఈ ఏడాది పాలన గురించి విశ్లేషణాత్మకంగా చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన చెప్పిన మాట ఏంటంటే.. సహజంగా ఏ ప్రభుత్వం మీద అయినా మూడు, నాలుగేండ్ల తర్వాత కోపం వస్తది.. తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఏడాదిలోనే మనసు విరిగింది. కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేస్తున్నారో దీన్ని తప్పకుండా కొనసాగించండి.. అధికారం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారని కేటీఆర్ తెలిపారు.

గాంధీ భవన్ బోసిపోతోంది%ో% తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోంది. లగచర్ల గిరిజన ఆడబిడ్డలు అందరూ వచ్చి తమ కుటుంబ సభ్యులను జైలు నుంచి విడిపించాలని కోరారు. వారి విడుదల కోసం లీగల్ సెల్ బృందం కష్టపడి న్యాయ పోరాటం చేస్తున్నారు. గిరిజన రైతులను బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పాను. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు కూడా ఫిర్యాదులు చేశాం. ఇక మా బకాయిలు ఇప్పించాలని మాజీ సర్పంచ్‌లు అడిగారు. ఆశా వర్కర్లు మా గురించి అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతున్నారు. ఈ ఒక్కరోజే అందరూ తెలంగాణ భవన్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారని కేటీఆర్ తెలిపారు.

సూటిగా, సుత్తి లేకుండా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్‌లో స్పష్టంగా చెప్పారు. గుండెకు తట్టే విధంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు రగిలిపోతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతాం. ప్రజల తరఫున ప్రభుత్వంపై తప్పకుండా పోరాటం చేస్తాం. మనకు అధికారం మాత్రమే పోయింది.. పోరాట యావ, చేవ పోలేదు. ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదు.. పెరిగింది అని కేటీఆర్

# ప్రజాపాలన విజయోత్సవాల వేడుకలు

**7వ తేదీ నుండి 9వ వరకు**

**సంగీత కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు**

**ఘనంగా ప్రజాపాలన ముగింపు విజయోత్సవ సంబరాలు**

(వేకువసమయం ప్రతినిధి–హైదరాబాద్)

ప్రజాపాలన విజయోత్సవాల వేడుకలను డిసెంబర్ 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలలో ప్రజలు పాలుపంచుకుని సంబరాలు జరుపుకునే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేశారు. ఈ మేరకు ట్యాంక్ బండ్, నెక్లెస్‌రోడ్, హెచ్‌ఎండివే గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత, సాంస్కృతిక వినోద కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, రాహుల్, సిప్లిగంజ్, తమస్‌ల సంగీత కచేరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఎన్టీఆర్ మార్గ్ వద్ద బాణసంచా ప్రదర్శన, ట్యాంక్‌బండ్ వద్ద డ్రోన్‌షో, భారత వాయుదళంచే ఎయిర్‌షో ఆహుతులను ఆకట్టుకోనున్నాయి. ఈ మేరకు ఈనెల 7వ తేదీన మూడు వేదికలవద్ద సాయంత్రం 5 నుండి 9 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, హెచ్‌ఎండివోలు రాత్రి 7 నుండి 8.30 వరకు వందేమాతరం శ్రీనివాస్‌చే సంగీత కచేరి, వేదికల వద్ద ఉదయం నుండి రాత్రి వరకు ఫుడ్ స్టాల్స్, హాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్, రాత్రి సమయంలో దీపాలంకరణను నగరంలో ఏర్పాటుచేశారు. ఆదివారం నాడు ట్యాంక్ బండ్ వద్ద భారత వాయుదళంచే ఎయిర్‌షో, రాత్రికి హెచ్‌ఎండిఎ, ఐమాక్స్ గ్రౌండ్స్‌లో రాహుల్ సిప్లీగంజ్‌చే సంగీత కచేరీ, మూడు వేదికల వద్ద సాయంత్రం 5 నుండి 9 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, వేదికల వద్ద ఉదయం నుండి రాత్రి వరకు ఫుడ్ స్టాల్స్, హాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్, రాత్రి సమయంలో దీపాలంకరణను నగరంలో ఏర్పాటుచేశారు. అలాగే ఈ నెల9వ తేదీన సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, 5 నుండి 5.45 వరకు సాయంత్రం వేళ ముఖ్యమంత్రి బహిరంగసభ అనంతరం 15 నిమిషాలు డ్రోన్‌షో, 15 బాణసంచా కాల్పులు, 6.10 సాయంత్రం సిఎం కల్చరల్ వేదికకు చేరుకుంటారు. ఆ తదుపరి హెచ్‌ఎండిఎ, ఐమాక్స్ ల వద్ద ఎస్.తమస్‌చే సంగీత కచేరి సాయంత్రం 7 నుండి 8.30 వరకు, సాయంత్రం 5 నుండి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, వేదికల వద్ద ఉదయం నుండి రాత్రి వరకు ఫుడ్ స్టాల్స్, హాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్, రాత్రి సమయంలో దీపాలంకరణను నగరంలో ఏర్పాటుచేసినట్లు పౌరసంబంధాల శాఖ కమిషనర్ తెలిపారు.



## సంపాదకీయం

# ఈ వివాదాలకు అంతమెక్కడ?

చాలా చట్టాల రూపకల్పనను నేను మొదటి నుంచి చివరివరకు పర్యవేక్షించడం జరిగింది. ముసాయిదా బిల్లు చిన్నదిగా, స్ఫుటంగా, స్పష్టంగా ఉండాలని న్యాయమంత్రిత్వ శాఖ న్యాయశాస్త్ర నిపుణులకు గట్టిగా సూచించేవాణ్ణి. 'ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం%-%1991' నా ప్రమేయమున్న చట్టాలలో ఒకటి. అది చాలా చిన్న చట్టం. 8 సెక్షన్లు మాత్రమే అందులో ఉన్నాయి. ఆ చట్టానికి ఒక లక్ష్యమున్నది. ఆ లక్ష్యం స్ఫుటంగా ఉన్నది: ఆగస్టు 5, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని స్తంభింపజేయడం అంటే యథాతథంగా ఉండేలా చేయాలని నిర్దేశించింది. ఆ చట్టం చాలా స్పష్టంగా ఉంది. 'అయితే'లు, 'అయినా'లు, 'కానీ' లకు లేదా అయినప్పటికీ' ఇత్యాది మినహాయింపులు, అభ్యంతరాలకు తావివ్వనిదిగా ఉన్నది. మరీ ముఖ్యంగా ఆ చట్టం పూర్తిగా 'పక్షపాత రహితం'గా ఉన్నది. పూర్వ భావనలు, అవిచారితాభిప్రాయాలను ప్రోత్సహించేదిగా లేదు.ఆ చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4 (1)ని ప్రతి ఒక్కరూ చదవాలని నేను కోరుతున్నాను. సెక్షన్ 3: ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని మార్చడంపై నిషేధం. ఒక మతపరమైన ప్రార్థనా స్థలం లేదా మతపరమైన ప్రార్థనా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి లేదా అదే మతానికి చెందిన వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనా స్థలంగా ఎవరూ మార్చకూడదు. సెక్షన్ 4: ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని మార్చడానికి సంబంధించి అన్ని అప్పీళ్లు, దావాలు లేదా ఇతర న్యాయవిచారణ కార్యకలాపాలు చట్టం ప్రారంభమైన తరువాత ముగుస్తాయి. తాజా అప్పీళ్లను దాఖలు చేయడం అనుమతించడబదు. ఆగస్టు 15, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావం ఎలా ఉన్నదో, ఆ రోజున ఉన్న రీతిలోనే కొనసాగుతుంది. అయితే (అయోధ్యలో ఉన్న) రామజన్మభూమి%-%బాబ్రీ మసీదుగా దేశ ప్రజలకు సుపరిచితమైన ప్రార్థనా స్థలాన్ని మాత్రం ఈ చట్టం నుంచి మినహాయించారు. ఆ ప్రార్థనా స్థలంపై అప్పటికే సుదీర్ఘకాలంగా న్యాయ వివాదం కొనసాగుతుండడమే ఆ మినహాయింపునకు కారణం.ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం లక్ష్యం, ఉద్దేశం, స్ఫూర్తి, పరిధికి విస్తృతంగా ప్రజామోదం లభించింది. సామాన్య విద్యావంతులు, న్యాయశాస్త్ర నిపుణులు ఆ చట్టాన్ని హర్షామోదాలతో స్వాగతించారు. ఆ చట్టం తన లక్ష్యాన్ని సాధించిందని నేను అభిప్రాయపడుతున్నాను. వివిధ ప్రార్థనా స్థలాలకు సంబంధించిన పలు వివాదాలపై ఎటువంటి జగడాలు లేకుండా మూడు దశాబ్దాల పాటు ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దేవాలయం ఒక దేవాలయంగా ఉండాలని, ఒక మసీదు ఒక మసీదుగా ఉండాలని, ఒక చర్చి ఒక చర్చిగా ఉండాలని, ఒక గురుద్వారా ఒక గురుద్వారాగా ఉండాలని, ఇంకా ఇతర మతాల ప్రార్థనా స్థలాలు ఆగస్టు 15, 1947న ఎలా ఎలా ఉన్నాయో అలాగే యథాతథంగా ఉండాలనే విషయాన్ని దేశ పౌరులు చాల వరకు అంగీకరించారు.దురదృష్టవశాత్తు ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం అమలవుతున్న తీరు తెన్నులపై సమగ్ర సమాచారం లేదు. PRISM పార్లమెంటు కార్యకలాపాల పరిశోధనా సంస్థ)ను వాకబ్ చేయగా ఆ చట్టం కింద జరిగిన అరెస్టులు, విధింపబడిన శిక్షల గురించి పార్లమెంటులో మూడు సందర్భాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం చప్పిడి సమాధానాలు మాత్రమే ఇచ్చిందని తెలియజేసింది. మొత్తం మీద కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆ చట్టం పనిచేస్తున్న తీరుపై నిరపాయకరమైన నిరక్ష్యం చూపారని చెప్పవచ్చు.న్యాయస్థానాలు రంగప్రవేశం చేశాయి. అక్టోబర్ 28, 2020న దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఒక రిట్ పిటిషన్ దాఖలయింది. ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం%-%1991లోని సెక్షన్లు 2, 3, 4 సెక్షన్లను నిష్ప్రయోజనకరమైనవిగాను, రాజ్యాంగవిరుద్ధమైనవిగాను ప్రకటించాలని ఆ రిట్ పిటిషన్ విజ్ఞప్తి చేసింది. పిటీషన్‌దారు అందుకు చూపిన కారణమేమిటి? అనాగరిక దురాక్రమణదారులు న్యాయసమ్మతం కాని రీతిలో 'ప్రార్థనా స్థలాల'ను తమవిగా చెల్లబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నందున 1991 చట్టంలోని 2, 3, 4 సెక్షన్లను రద్దు చేయాలి. ఇదీ ఆ పిటీషనర్ వాదన.సెక్షన్ 3, సెక్షన్ 4 ఆ చట్టంలోని కీలక భాగాలు. అవి లేకుంటే ఆ చట్టంలో ఏమీ ఉండదు. అది అసలు అనవసరం. భారత రాజ్యాంగం అధికరణలు 14, 15, 21, 25, 26, 29ని ఆ రెండు సెక్షన్లు ఉల్లంఘిస్తున్నాయనే వాదనతో సుప్రీంకోర్టులో సెక్షన్ 3, సెక్షన్ 4ను సవాల్ చేశారు. ఆ 'ప్రార్థనా స్థలాలు' అనాగరిక దురాక్రమణ దారులు చట్టవిరుద్ధంగా స్వాయత్తం చేసుకున్నవని పిటీషనదారు పేర్కొనడం గమనార్హం. ఏ మత ప్రజల తరపున తాను ఈ పిటిషన్ దాఖలు చేసింది, ఏ మత సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పిటీషన్‌ను వేసింది కూడా పిటీషన్‌దారు స్పష్టంగా పేర్కొన్నాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'హిందువుల, జైనుల, బౌద్ధుల, సిక్కుల' మత ప్రదేశాలను చట్టబద్ధంగా ఆయా మతస్థులకు పునరుద్ధరించాలని ఆ పిటీషన్‌దారు అభ్యర్థించాడు. అక్టోబర్ 28, 2020 నుంచి ఆ రిట్ పిటీషన్ పెండింగ్‌లో ఉన్నది.2023లో సుప్రీంకోర్టు ఒక స్పెషల్ లీవ్ పిటీషన్ (ఎస్ఎల్‌పి)ను విచారణకు స్వీకరించింది. వారణాసిలోని అంజుమన్ ఇంతెజామియ మసీద్ నిర్వహణా కమిటీ ఆ పిటిషన్‌ను దాఖలుచేసింది. ఆగస్టు 3, 2023న అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఒక ఆదేశాన్ని ఆ ఎస్ఎల్‌పి సవాల్ చేసింది. జ్ఞాన్‌వాపి మసీదు ఉన్న స్థలాన్ని సర్వే చేయాలని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ను జిల్లా జడ్జి ఆదేశించారు. ఈ ఆదేశానికి వ్యతిరేకంగా వారణాసిలోని అంజుమన్ మసీదు నిర్వహణదారుల అప్పీల్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టి వేసింది. హైకోర్టు నిర్ణయాన్ని అంజుమన్ మసీదు నిర్వహణదారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆగస్టు 4, 2023న సుప్రీంకోర్టు జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇలా పేర్కొంది: 'హైకోర్టు అభిప్రాయంతో విభేదించలేక పోతున్నాం. రాజ్యాంగ అధికరణ 136 కింద మా న్యాయాధికారాలను వినియోగించుకుంటూ ఆ నిర్ణయానికి వచ్చాం.. సొలిసిటర్ జనరల్ వాదనలను నమోదు చేశాం. ఈ కేసులో న్యాయప్రక్రియ అంతా ఎఎస్ఐ అనుసరించే పద్ధతులపై ఆధారపడి ముగుస్తుంది'.సుప్రీంకోర్టు ఉత్తర్వు అనేక ఉపద్రవాలకు ఆస్కారం కల్పించింది. చిక్కులకు దారితీస్తోంది. 2022లో సివిల్ దావా (18) వేసిన వారి ఉద్దేశాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరపలేదు. ఆ దావా వేసినవారి అభ్యర్థన: జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలోని ఉన్న దేవతామూర్తులకు పూజలు, ఇతర క్రతువులు నిర్వహించే హక్కు తమకు ఉందని, కనుక ఆ మసీదులో పూజలకు తమను అనుమతించాలి. ఒక మసీదులో ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు తమను అనుమతించాలన్నదే దావా వేసిన వారి అభ్యర్థన అన్నది స్పష్టం.

## మహా వికాస్ అఘాడీకి మరో షాక్.. కూటమి నుంచి ఎస్పీ ఔట్

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన మహా వికాస్ అఘాడీలో పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. బాబ్రీ మసీదు కూల్చివేతకు సంబంధించి శివసేన (యూబీటీ) నేత ఒకరు చేసిన వ్యాఖ్యలే ఇందుక్కారణం..! ఆ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ సమాజ్‌వాదీ పార్టీ కూటమి నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. అసలేం జరిగిందంటే..



బాబ్రీ మసీదు కూల్చివేతపై శివసేన (యూబీటీ – ) ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ చేశారు. 'ఈ పని చేసిన వారి పట్ల నేను గర్వంగా ఉన్నా' అని శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే చేసిన వ్యాఖ్యలను రాసుకొచ్చారు. అటు ఓ వార్తాపత్రికలోనూ దీనిపై ప్రకటన ఇచ్చారు. ఈ పరిణామాలపై సమాజ్‌వాదీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇండియా కూటమి చీఫ్‌గా మమత..?విపక్షంలో భిన్న స్వరాలు

"ఇలాంటి చర్యలకు పాల్పడితే భాజపా కు వారికి తేడా ఏముంది? మేం ఇంకా ఎందుకు వారితో కలిసి ఉండాలి? మహా వికాస్ అఘాడీ నుంచి మేం వైదొలుగుతున్నాం. ఇదే విషయాన్ని పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లాం" అని ఎస్పీ మహారాష్ట్ర చీఫ్ అబు అజ్మీ వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ పార్టీ ఎంవీకే కూటమితో కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. రెండు అసెంబ్లీ స్థానాలకు దక్కించుకుంది. ఎస్పీ ప్రకటనపై శివసేన (యూబీటీ) ఇంకా స్పందించలేదు.

ఇదిలా ఉండగా.. హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్ ఓటమి చవిచూసిన నేపథ్యంలో కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. ఇప్పటికే ఈ కూటమి పనితీరుపై పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పెదవి విరిచిన సంగతి తెలిసిందే. అవకాశం వస్తే ఇండియా కూటమికి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనని ఆమె అన్నారు. దీదీ వ్యాఖ్యలపై కూటమిలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఆమెకు మద్దతు ప్రకటించగా.. కాంగ్రెస్ వ్యతిరేకించింది.

## ఇండియా కూటమి చీఫ్‌గా మమత..?విపక్షంలో భిన్న స్వరాలు

ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వం వహించడంపై భాగస్వామ్య పార్టీల నుంచి భిన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.



దిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే కూటమి ఓటమే లక్ష్యంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. అవకాశం వస్తే ప్రతిపక్ష కూటమికి తాను సమర్థంగా నేతృత్వం వహిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించడంపై విపక్షంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. దీదీకి ఆ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మరోవైపు.. ఆమెకు సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) నేతలు మద్దతు తెలుపుతున్నారు. దీంతో కూటమిలో గందరగోళ వాతావరణం నెలకొంది.

"సీఎం మమతకు కూటమి బాధ్యతలు అప్పగించేందుకు మేం పూర్తి మద్దతు తెలుపుతున్నాం. ఎందుకంటే.. ఆమె నేతృత్వంలోని టీఎంసీ పశ్చిమబెంగాల్‌లో భాజపాకు గట్టి పోటీ ఇస్తోంది. ఆ పార్టీని నిలువరించడంలో సమర్థంగా పని చేస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై నేతలంతా సమగ్ర చర్చలు జరపాలి. ఆమెకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం" అంటూ సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ పేర్కొన్నారు.

**ఓటమికి కాంగ్రెస్సే కారణం..**

"హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి విజయం సాధించకపోవడానికి కారణం కాంగ్రెస్సే. ఆ రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తప్పిదాలకు బాధ్యత కూడా వారిదే" అని హస్తం పార్టీపై విరుచుకుపడ్డారు. మరోవైపు.. ఆర్జేడీ స్పందిస్తూ ఇండియా కూటమికి బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ సరైన రూపశిల్పి అవుతారని పేర్కొంది.

**అదే పాటిస్తాం..**

"కాంగ్రెస్ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి భాగస్వాములకు చోటు కల్పించలేదు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ పార్టీ మిత్ర పక్షాల మాట విని ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవి" అని సీపీఐ జనరల్ సెక్రటరీ డి. రాజా మండిపడ్డారు. మమతకు బాధ్యతలు అప్పగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. "మమత చెప్పినట్లు ఆమె పార్టీ నడుస్తుంది. అదే విధంగా మేము కూడా మా పార్టీ నిర్ణయాలనే పాటిస్తాం" అంటూ మనసులో మాట బయటపెట్టింది.

ఈ పరిణామాలపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా స్పందించారు. "ఇండియా కూటమిలో టీఎంసీ అధినేత్రి ప్రధాన భాగస్వామి కావాలని కోరుకుంటున్నాం. ఆ స్థానంలో ఆమె కానీ, అరవింద్ కేజ్రీవాల్, శివసేన ఎవరున్న మేమంతా కలిసే ఉంటాం. ఈ విషయంపై మమతా బెనర్జీతో చర్చలు జరిపేందుకు త్వరలో కోల్‌కతా వెళతాం" అని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయం: ఆదిత్య థాక్రే

శివసేన యూబీటీ ఎమ్మెల్యేలు ఇవాళ మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయడం లేదని ఆ పార్టీ నేత ఆదిత్య థాక్రే తెలిపారు.




ముంబయి: మహారాష్ట్రలో మహాయుతి కూటమి నేతృత్వంలోని ప్రభుత్వం కొలువుతీరిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకొంది. నేడు జరగాల్సిన ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రతిపక్ష కూటమి 'మహావికాస్ అఘాడీ' ఎమ్మెల్యేలు బహిష్కరించనున్నారు. ఈవిషయాన్ని శివసేన (యూబీటీ), మాజీమంత్రి ఆదిత్య థాక్రే వెల్లడించారు.

"ఎంవీఏలో భాగమైన శివసేన(యూబీటీ) ఎమ్మెల్యేలు నేడు మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయడం లేదు. ఈవీఎంలపై మాకు అనేక అనుమానాలు ఉన్నాయి. అందుకు నిరసనగా నేడు ప్రమాణస్వీకారం చేయడం లేదు. ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఫలితాలపై ప్రజలు సంతృప్తిగా లేరు. ఈవీఎంల విషయంలోను తప్పు జరిగింది. ప్రజలిచ్చిన తీర్పు అయితే వారంతా సంతోషంగా ఉండేవారు. అలా జరగలేదు కాబట్టే ఎక్కడా విజయోత్సవాలు కనిపించడం లేదు" అని ఆదిత్య థాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు.

ఆదిత్య చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ స్పందించారు. ఆయన చేసిన ఆరోపణలను ఖండించారు. "ప్రతిపక్ష కూటమి నేత చేస్తున్న ఆరోపణలకు తావు లేదు. అవసరమైతే న్యాయస్థానాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలి" అని సూచించారు. నేడు ఎమ్మెల్యేలుగా దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్‌తో సహా పలువురు ప్రమాణం చేశారు.

ఏక్‌నాథ్ శిందే హోంశాఖ కావాలని అడిగారు: శివసేన ఎమ్మెల్యే

కాగా.. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 సీట్లను సొంతం చేసుకున్న మహాయుతి కూటమి దేవేంద్ర ఫడణవీస్‌కు సీఎం బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ప్రస్తుతం శాసనసభ ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయి. స్పీకర్‌గా బాధ్యతలు ఎవరు స్వీకరించనున్నారనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో నూతన స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. అప్పటివరకు ప్రొటెం స్పీకర్‌గా కాళిదాస్ కొలంబ్కర్‌ను.. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ నియమించారు.

### వేములవాడలో కోడెల విక్రయం..

## వార్తలు అవాస్తవం:

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు జీవోను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, సంబంధిత మండల వ్యవసాయాధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఒక రైతుకు రెండు కోడెల చొప్పున ఇస్తున్నామన్నారు.

ఇద్దరు పిల్లలు చాలు.. కుటుంబమే నా బలం: నాగచైతన్య

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోడెల సంరక్షణ కోసం గోశాలలో సీసీ ఫ్లోరింగ్, సరిపడా షెడ్లు, తాగు నీటి వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. తమ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో గోశాలల నిర్వహణ, గోవుల సంరక్షణ చేపడుతున్న క్రమంలో కోడెలను అక్రమంగా విక్రయించారంటూ వచ్చిన వార్తలు వట్టి వదంతులేనని కొట్టి పారేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా తన వద్దకు వచ్చే దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు సూచిస్తుంటామని.. కోడెల పంపిణీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులను అదే విధంగా పంపించామన్నారు. దేవస్థానం అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే రైతులకు కోడెలను పంపిణీ చేశారని తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానంలోని ప్రతి కోడెకు శాశ్వతమైన ట్యాగ్ ఉంటుందని, అలాంటి కోడెలు బయట వారి వద్ద ఇంతవరకు ఎక్కడా దొరకలేదని చెప్పారు. ఈ వ్యవహారంపై నిజనిజాలు వెల్లడిస్తూ దేవస్థానం ఈవో స్పష్టత ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలు దెబ్బతీస్తుందంటూ అవాస్తవ ప్రచారం చేస్తూ సమాజంలో అశాంతిని సృష్టించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా?: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నది. బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు.

ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్‌ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. రైతులను కాదని సర్వేలు నిర్వహించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడం. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారు. నాడు ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్పు అన్నారు నేడు మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా?. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీతో.. ఆర్ఆర్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పించారు. కానీ, అధికారంలోకి రాగానే బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. వేధిస్తూ దాడులకు దిగుతున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీ అమలు చేయండి. లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

దక్షిణ దిక్కున 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకున్నట్లుగానే, ఉత్తర భాగాన పరిగణలోకి తీసుకోవాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ఈ విషయంలో ప్రభుత్వం దిగిరాకుంటే బాధితుల పక్షాన బి ఆర్ ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరిస్తున్నాం. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల గొంతును వినిపిస్తాం. ప్రభుత్వాన్ని నిలదీస్తాం. సమస్య పరిష్కరించే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది.

## ఎంవిఎస్ కళాశాల సమీకృత విద్యా భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని, క్రిష్టియన్ పల్లి లోని ఎంవిఎస్ కళాశాల సమీకృత విద్యా భవనానికి శనివారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చుటకు నిరంతరం కృషి చేస్తామని, రానున్న రెండు మూడు సంవత్సరాల్లో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక సదుపాయాల కల్పన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాణి రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలి, గుండా మనోహర్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, ఎంవిఎస్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం డిసెంబర్ 8 2024

# వక్ఫ్ బూచిని ఊదేసిన అధికారులు

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం
ప్రతినిధి మేడ్చల్ నియోజక వర్గం

**వక్ఫ్ ఆక్రమణ అంటూ ఒక వీడియో గత నవంబర్ నెలలో వైరల్ అయ్యింది.**

**సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రామారం గ్రామానికి చెందిన వీడియో ఇది.**







రామారం గ్రామంలోని 481 సర్వే నంబర్ లో అక్రమంగా ఒక మసీదు,దర్గాతో పాటు,కాంపౌండ్ మరియు ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయంటూ వెలువడ్డ వీడియో సమాచారం అందరినీ ఉలికిపాటుకు గురిచేసింది.ఈ విషయంలో వెంటనే సంబంధిత ప్రభుత్వ శాఖలన్నీ అప్రమత్తమయ్యాయి.ఈ వీడియోలో ఉన్న విషయం గురించి తెలుసుకోవడానికి,నిజా నిజాలు వెల్లడించడానికి కరపత్రం ప్రతినిధి కరుణాకర్ స్వయంగా ఆ గ్రామానికి వెళ్ళడం జరిగింది.గత నవంబర్ 20 వ తేదీ దరిదాపుల్లో ఆ వీడియో వెలువడిన తర్వాత జరిగిన పరిణామాలను సవివరంగా సేకరించడం జరిగింది.కరుణాకర్ మొదట నేరుగా రామారం గ్రామానికి వెళ్ళి స్థల పరిశీలన చేసారు.రామారం గ్రామపంచాయతీ కార్యాలయం కు వెళ్లి విషయ సేకరణ చేసారు.కరుణాకర్, ఆ గ్రామ ఎంపిటిసి శ్రీ సీహెచ్ రాజి రెడ్డి గారితో,ప్రభుత్వ అధికారులను కలిసి క్షేత్ర స్థాయి లో వాస్తవ విషయాలను తెలుసుకున్నారు.ఇక అసలు విషయంలోకి వస్తే రామారం గ్రామంలోని సర్వే నం.481 లో మొత్తం 234 ఎకరాల 38 గుంటల భూమి ఉన్నది.ఇది మొత్తం ప్రభుత్వ భూమి.ఈ భూమిలో తరాలుగా స్థానిక వ్యక్తులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ మొత్తం భూమిలో రైతులు బోర్ల ద్వారా వ్యవసాయం చేసుకుంటుండేవారు.రామారం గ్రామానికి 25 కి.మీ ల దూరంలో నిర్మించిన కొండ పోచమ్మ రిజర్వాయర్ నుండి వచ్చిన కెనాల్ ఈ భూమిలో నుండి వెళ్లింది.దీనితో రైతులకు సౌలభ్యం కలిగింది,భూమికి విలువ ప్రాముఖ్యత పెరిగింది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారు ఉన్న సమయంలో ఈ రైతులందరికీ ఈ భూముల్లో లావునీ పట్టాలు అసైన్ చెయ్యడం జరిగింది. అదే సమయంలో రిటైర్డు రైల్వే ఉద్యోగి,సమీప ఒడియారం గ్రామస్థుడైన శ్రీ చిన్నలచ్చు పోచయ్య గారి స్వాధీనంలో ఉన్న భూమికి కూడా స్థానిక తహసీల్దార్ ఈ లావుని భూమి అసైన్ చేసారు.అసైన్డ్ చట్టం ప్రకారం ఈ భూమిని కేవలం వ్యవసాయం కొరకు మాత్రమే ఉపయోగించాలి. శ్రీ పోచయ్య చనిపోయిన తర్వాత అతని కొడుకు అశోక్ వ్యవసాయం చెయ్యలేని స్థితిని గమనించిన మక్రాజ్ పేట్ కు చెందిన ముస్లిమ్ (పేరు వ్రాయలేదు) ఒకతను ఈ భూమిని కొనుక్కున్నాడు. మొత్తం రెండు ఎకరాలు తన స్వాదీనం చేసుకున్నాడు.అసైన్డ్ చట్టం ప్రకారం లావునీ భూమిలో వ్యవసాయం తప్ప ఎలాంటి ఇతర పనులు చెయ్యకూడదు. ముఖ్యంగా అసైన్ భూమిని అమ్మడం కొనడం చెల్లదు.వ్యవసాయం కొరకు మాత్రమే ఈ భూమి




కొనుక్కుంటున్నానని నమ్మించి ఆ ముస్లిం వ్యక్తి రెండెకరాల భూమి తన స్వాదీనంలోనికి తీసుకున్నాడు.తర్వాత మెల్లగా ఆ భూమిలో అతడు మసీదు,దర్గా నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలానికి కాంపౌండ్ కూడా నిర్మించాడు.ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. స్థానికులు అతని చర్యలను ప్రశ్నించేసరికి ఆ ముస్లిం వ్యక్తి గ్రామస్థుల పట్ల ధిక్కారం ప్రదర్శించాడు.ఈ ముస్లిమ్ మెల్లగా తన స్వాధీనంలో ఉన్న భూమితో పాటు ఆ సర్వే నంబర్ లోని మొత్తం 235 ఎకరాల భూమి కూడా మాదే అని, ఇదంతా వక్ఫ్ భూమి అని గొణుగుతూ అనడంతో గ్రామంలో చుట్టుపక్కల ఒక ఆందోళన మొదలయ్యింది. ఆ నోటా ఈ నోటా ఈ విషయం ఒక సంచలనంగా మారింది.స్థానిక వ్యక్తులు కొందరు ఏకంగా వీడియో తీసి ఈ వందల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డు పరం కాబోతున్నదని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరడం ఒక సంచలనంగా మారింది.ఈ వీడియో సమాచారం విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఈ అక్రమ కట్టడాల పట్ల స్థానిక ప్రజల ఆందోళనతో రెవెన్యూ అధికారులు,పంచాయతీ రాజ్ శాఖ అధికారులు




విచారణ చేపట్టారు.ఈ స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని గ్రామ పంచాయతీ కార్యాలయ రికార్డుల్లో వెల్లడయ్యింది.ఈ అసైన్ భూమిని వ్యవసాయేతర ఉపయోగాలకు వాడుకుంటున్నారని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ భూమి కొనుగోలు చెల్లదని అధికారులు భూమి స్వాదీనం చేసుకొనే చర్యలకు ఉపక్రమించారు.అంతేకాక ఆ ముస్లిమ్ వ్యక్తి ఈ భూమి తన స్వాధీనంలో ఉంచుకోవడం తప్పు అని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.అన్ని విషయాలు సమగ్ర దర్యాప్తు చేసిన అధికారులు పోలీసులకు సమాచారం అందించి, వారి సహకారంతో నవంబర్ 23,24 తేదీల్లో ఈ ఆక్రమణలను కూల్చివేసారు.రెవెన్యూ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా గజ్వేల్




ఎసిపి శ్రీ పురుషోత్తం రెడ్డి గారు రాయపోలు సిఐ శ్రీ షేఖ్ లతీఫ్ ను,స్థానిక రాయపోలు పోలీస్ ఎస్ఐ శ్రీ రఘుపతి రెడ్డి గారాలకు స్థల రక్షణ చర్యలకు ఆదేశించారు.ఎస్ఐ సిఐ తమ సిబ్బందితో రామారం గ్రామంలోని ఈ అక్రమ మసీదు,దర్గాతో పాటు కాంపౌండ్ మరియు ఇతర నిర్మాణాలను కూల్చి వేసారు.ఇప్పుడు అక్కడ అక్రమ కట్టడాల ఆనవాళ్లు కూడా లేకుండా చేసారు.ఇది జరిగిన తర్వాత రాయపోల్ తహసీల్దార్ గారు, ఈ అక్రమ దర్గా పై తగు విచారణ జరుప వలసిందిగా కోరుతూ గజ్వేల్ ఆర్డివో గారికి లేఖ వ్రాయడం జరిగింది.ప్రభుత్వ భూముల్లో కాని, ఇతర స్థలాల్లో కాని తగిన అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని గజ్వేల్ ఎసిపి శ్రీ గోవర్ధన్ రెడ్డి గారు ప్రకటించారు. అక్రమ నిర్మాణాలు చేసే వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.వక్ఫ్ ఆక్రమణ పేరిట చలామణిలో ఉన్న వీడియో తో మత ఘర్షణలకు తావు లేకుండా సకాలంలో తగు చర్యలు చేపట్టిన ప్రభుత్వ అధికారుల తక్షణ స్పందన పట్ల ప్రజలు హర్షం చేస్తున్నారు.ఈ విషయం గురించి క్షేత్ర స్థాయిలో విషయ సేకరణ చేసి సమగ్ర వార్త అందించిన కరపత్రం ప్రతినిధి కరుణాకర్ మల్లిగారి కృషిని,అతనికి సహకారం అందించిన మహేష్ ను కరపత్రం అభినందిస్తున్నది.

## స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విజేతలకు బహుమతులు
## ప్రధానం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**వర్గల్ డిసెంబర్ 07 కరపత్రం**
వర్గల్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల లో స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం.ముఖ్య అతిథిగా హాజరైన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు.. స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ నాలుగు రోజుల క్రీడా పోటీల్లో ఒకరోజు మొత్తం ఇక్కడే ఉండి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుందాం అనుకున్న సంవత్సర క్రితం కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి సంవత్సరం సెలబ్రేషన్స్ మీ అందరి సమక్షంలో జరుపుకుంటున్న ప్రభుత్వంలో తీసుకునే నిర్ణయాల్లో బాధ్యతగా ఉన్నాం..విద్యార్థి నాయకుడిగా నాకు అవకాశం ఉన్నప్పుడల్లా విద్యార్థుల సమస్యలు ,ఉపాధ్యాయుల సమస్యలు ,వారికి ప్రమిషన్లు మౌళిక వసతులు పై నా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న తెలంగాణ వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల 25 వేల స్కూల్ లకి 1100 కోట్ల తో మౌలిక సదుపాయాలు కల్పించాం ఉపాధ్యాయుల నియామకాలు చేశాం..2010 నుండి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు లేవు.. వారికి బదిలీ చేసి అసహనం తొలగించామ్ విద్యార్థులకు ఎక్కడ ఇబ్బంది



కలగకూడదని అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..గురుకులాల్లో చల్లని నీళ్ళతో స్నానం చేయద్దని వాటర్ హీటర్లు ఏర్పాటు చేస్తున్నాం..ప్రభుత్వం సొంత భవనాల్లో గురుకులాలు ఏర్పాటు చేస్తున్నాం..నాణ్యమైన ఆహారం అందించడానికి డైట్ కాస్మొటిక్ చార్జీలు పెంచాం డైటీషన్ సలహాతో ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ గురుకుల సెక్రటరి లతో మెనూ ఏర్పాటు చేస్తం..అద్దె భవనాల్లో అద్దెలు చెల్లించాం..భవిష్యత్ లో గురుకులాల్లో గ్రీన్ ఛానెల్ ద్వారా మెస్ ఛార్జీలు ఇస్తాం.5 వేల కోట్లతో 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొస్తున్నం..అక్కడక్కడ ఫుడ్ పాయిజన్ కేసులు అవుతున్నాయి..ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు అయినా నాణ్యమైన ఆహార పదార్థాలు ఉండాలని ఆదేశాలు ఇచ్చాం.ఎక్కడైనా ఇబ్బంది వస్తె అధికారులపై చర్యలు తప్పవు.తల్లిదండ్రులు వదిలి పిల్లలు ఇక్కడికి వస్తున్నారు..మన పిల్లలాగా చూసుకోవాలి మీ ఉజ్వల భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పటి నుండే కష్టపడి పైకి రావాలి.మన మేధాశక్తి నీ వృదా చేయవద్దు.. దానికి పని పెట్టాలి అప్పుడే ఉన్నత శిఖరాలకి వస్తాం
మా గురువు చట్టం చెప్పినట్టు నడువు లేదంటే ప్రజలు మెజారిటీ చెప్పినట్టు నడువు అని చెప్పేవారు మీకు మీ తల్లిదండ్రులకు మీ గ్రామానికి మంచి పేరు రావాలంటే శ్రమపడాలి అన్నిట్లో నెంబర్ 1 ఉండాలి లక్ష్యం పెట్టుకొని పని చేయాలి క్రీడలు ,చదువుల్లో లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలి ప్రజా ప్రభుత్వం లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నాం ఇప్పటి వరకు 116 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు..మేము ఏడాది కాలంలో చేసిన కార్యక్రమాలు ప్రోగ్రెస్ రిపోర్టు తెలంగాణ సమాజం ముందు ఉంచుతాం.తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్ ఆస్తిగా మిమ్మల్ని ప్రభుత్వం గుర్తిస్తుంది వచ్చే సంవత్సరం క్రీడల్లో మన గురుకులాల్లో మాత్రమే కాదు బయట జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలి విజేతలకు శుభాకాంక్షలు అభినందనలు..

## మహిళా కబడ్డీ జట్టుకు
## శుభాకాంక్షలు తెలిపిన ఎన్ సీ సంతోష్



**గజ్వేల్ డిసెంబర్ 07, కరపత్రం**
71 వ రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు వెళుతున్న సిద్దిపేట జిల్లా మహిళా కబడ్డీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, అనంతరం మహిళా కబడ్డీ జట్టుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కన్న యాదవ్, టిపిటిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ సౌజన్యంతో ఏకరుప దస్తులు అందజేశారు ఈ సందర్భంగా కన్నా యాదవ్ మరియు రాజేష్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపి, గజ్వేల్ లో ఇటీవల నిర్వహించిన కబడ్డీ క్యాంపుకు వసతి సౌకర్యం కల్పించిన జయశ్రీ హాస్పిటల్ డాక్టర్ వాసవాచారి మరియు భోజన సదుపాయం కల్పించిన ఐ వి ఎఫ్ నాయకులు దోమకొండ సతీష్, నేతి శ్రీనివాస్, కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, అనంతరం ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరపున మహిళ కబడ్డీ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సిద్దిపేట మహిళా కబడ్డీ సభ్యులు రాణించి విజయం సాధించి కప్పు తీసుకురావాల్సిందిగా కబడ్డీ క్రీడాకారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివకుమార్, జాయింట్ సెక్రెటరీ మహేష్, కార్యవర్గ సభ్యులు సంపత్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, ఉత్తనూరి సంపత్,బీసీ నాయకుడు మల్లేశం, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన..
## ప్రజా విజయోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### :- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**భువనగిరి కరపత్రం (ప్రతినిధి):-**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన యేడాది పూర్తి అవుతున్న సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 8 వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 6.00 గంటలకు



తెలంగాణ సంగీత నాటక చైర్మన్ అలేఖ్య పుంజల బృందం చే కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు .దీనికి సంబంధించి సన్నాహక ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయని అన్నారు తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పైన సంగీత, నాటక అకాడమీ ప్రొఫెసర్ అలేఖ్య పుంజల,బృందం అన్ని జిల్లాలో పర్యటించడం జరిగిందని . ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రేపు సాయంత్రం 6 గంటలకు ప్రొఫెసర్ అలేఖ్య పుంజల బృందం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా లోని ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు,పెద్దలు, మీడియా ప్రతినిధులు,అందరు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**తిమ్మాపూర్ డిసెంబర్ 7 కరపత్రం**




శనివారం గన్నేరువరం మండల పరిధిలోని జంగపల్లి జడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో బాల్య వివాహాల పై అవగాహన కల్పించారు చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ 27 నవంబర్ నుండి డిసెంబర్ 10 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామానుజచార్య లు ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత ఐ సి డి ఎస్ సూపర్ వైసర్ ఇజ్రాత్ సుల్తానా ,పద్మ ఐ సి పి ఎస్ అధికారి సాధినేని రమేష్ అంగన్వాడీ టీచర్లు హెడ్మాస్టర్ శారద అంగన్వాడీ టీచర్ ఉపాధ్యాయులు పిల్లల , తల్లి తండ్రిలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం

# కాబట్టే విజయోత్సవాలు జరుపుకుంటున్నాం

- పదేండ్లు అడ్డగోలుగా ప్రజాధనాన్ని లూటీ చేసి.. బిఆర్ఎస్ నేతలు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు
- కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, డైనమిక్ లైటింగ్ సిస్టం, కూడళ్ల సుందరీకరణ పనుల్లో కోట్లాది రూపాయల అవినీతి జరిగింది
- ఎంపి గా కేంద్ర మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధి కోసం రూపాయి నిధులు తీసుకురాని అసమర్థుడు బండి సంజయ్
- కలిసికట్టుగా ఉండి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్దాం
- బిఆర్ఎస్,బిజెపి పార్టీల అసత్య ప్రచారాలను తిప్పికొడదాం
- బీఆర్ఎస్,బిజెపి పార్టీల వైఖరిపై సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఫైర్
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- పార్టీ అందరికీ న్యాయం చేస్తుంది
- కో ఆర్డినేటర్ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపు



**కరీంనగర్, డిసెంబర్ 07 కరపత్రం**

గడచిన ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అవకాశం కల్పిస్తుందని కరీంనగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. కరీంనగర్ నియోజక వర్గ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సభ సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన ఇందిరా గార్డెన్ లో జరిగింది. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను చూసి బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక కుళ్లు కుతంత్రాలతో చేస్తున్నటువంటి అబద్ధాల ప్రచారాలను ఖండించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినటువంటి కార్పొరేటర్లు గతంలో కాంగ్రెస్ లో వివిధ హెూదాలలో పని చేసినవారేనని మీకు ఉన్నటువంటి అనుభవాన్ని పార్టీ ఆయా డివిజన్లో బలోపేతం దిశగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించినటువంటి ప్రతి కార్యక్రమంలో మీరే ముందుండి నడిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న గంగుల కమలాకర్ గతంలో మంత్రిగా అవినీతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ఈరోజు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు చూడలేకపోతున్నాయని ఓర్వలేకపోతున్నాయని దుయ్యబట్టారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జ్, డైనమిక్ లైటింగ్ సిస్టం ఈరోజు కళా విహీనంగా మారడానికి కాంగ్రెస్ పార్టీ కారణం కాదని, గంగుల కమలాకర్ మంత్రిగా ఉన్నప్పుడు, అశాస్త్రీయంగా, నాసిరకంగా జరిగిన పనులే బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాపాలకు నిదర్శనమన్నారు. కూడళ్ల సుందరీకరణ పనుల్లో ఇష్టానుసారంగా అంచనాలు పెంచేసి కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులదన్నారు. వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని చెప్పారు. అందరం కలిసికట్టుగా పార్టీ బలోపేతం కోసం పని చేద్దామని, బిఆర్ఎస్ పార్టీ గత పది సంవత్సరాలుగా చేసిన అవినీతి భాగోతాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ఎంపీగా ఉన్న బండి సంజయ్ గడచిన ఐదు సంవత్సరాలలో ఒక్క రూపాయి నిధులు తేకపోగా, ఇప్పుడు ఏడాది కాలంగా మంత్రిగా ఉండి కూడా కరీంనగర్ జిల్లాకు ఏం నిధులు తీసుకొచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీగా ఉన్నప్పుడు నిధులు తీసుకురావడం సాధ్యం కానీ బండి సంజయ్ కి, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు కూడా సాధ్యం కాదా అని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లాకు రూపాయి నిధులు తీసుకురాని బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీ మీద చార్జిషీట్ పేరుతో రావడం సిగ్గుచేటన్నారు. మనమంతా కలిసికట్టుగా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు ఖండిస్తూ, ప్రజలను ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. విజయోత్సవాల సందర్భంగా మూడు రంగుల బెలూన్లు గాలిలో ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, నియోజక వర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్,జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,పులి ఆంజనేయులు గౌడ్, పురం రాజేశం,ఆకారపు భాస్కర్ రెడ్డి, సమద్ నవాబ్, చర్ల పద్మ, కరీంనగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి,మడుపు మోహన్,కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,ఆర్ష కిరణ్మయి మల్లేశం,ఆకుల ప్రకాష్,ఆకుల నర్మద నర్సయ్య,గంట కల్యాణి శ్రీనివాస్,మెండి శ్రీలత చంద్రశేఖర్,కాశెట్టి శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

**-స్టోర్ రూం లో కాలంచెల్లిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దని -**
**-జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి-**



**వర్గల్ డిసెంబర్ 07, కరపత్రం**

శనివారం వర్గల్ మండలంలో గల జవహర్ నవోదయ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయ ప్రిన్సిపల్ టి. రాజేందర్ కలెక్టర్ కి విద్యాలయ ఆవరణ మొత్తం, డైనింగ్ హాల్, గరిష్ట బాలుర వసతి గృహం ఇతరత్ర అన్నింటీని చూపించారు. శనివారం తల్లిదండ్రులతో సమావేశం ఉంది కాబట్టి తల్లిదండ్రులతో విద్యార్థులు కలుస్తున్నారని తెలిపారు. విద్యాలయం లో మొత్తం 450 మంది విద్యార్థులు, 50మంది స్టాఫ్ పనిచేస్తున్నారని కలెక్టర్ కి తెలిపారు. విద్యాలయం మొత్తం చాలా శుభ్రంగా ఉందని అభినందించారు. డైనింగ్ హాల్ స్టోర్ గది మరియు కిచెన్ షెడ్ తిరిగి చుశారు. స్టోర్ రూం లో కాలంచెల్లిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దని మెను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు రూచికరమైన వంటను అందించాలని వంట సిబ్బందికి తెలిపారు. విద్యాలయం పాతభవనం కావునా చిన్న చిన్న రిపేర్లు ఉన్నాయని పిల్లలకు వైద్య సేవలు అందించడానికి మరియు ఇతరత్రా అవసరాల కొరకు ఒక వెహికల్ కావాలని ప్రిన్సిపల్ కలెక్టర్కు తెలుపగా అన్నిటికీ సానుకూలంగా స్పందించారు. అనంతరం ములుగు మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల ప్రిన్సిపల్ పుష్పలత ఇక్కడ 635 విద్యార్థులు విద్యను అందిస్తున్నామని వాష్ రూం రిపేర్లు, ప్రహరి గోడ నిర్మాణం మరియు మిషన్ భగీరథ వాటర్ సప్లే కోరకు అదనపు సంపు నిర్మాణం కావాలనీ కలెక్టర్ కి తెలుపగా ఈడబ్లుఐడిసి ఎఈ వచ్చి వీటికి కావలసిన అన్నింటికి రిపేర్లు చేయడానికైనా అన్నింటీని ఎస్టిమేట్ చేస్తారని తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ఎంపిసి తరగతి లోకి వెళ్ళి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఫిజిక్స్ లో ఉన్న కోన్ని విషయాల గుర్చి మాట్లాడారు. ఫిజిక్స్ ఎక్కువగా మన చుట్టు ప్రక్కల ఉన్న వాటిని చుస్తు నేర్చుకుంటే బాగ అర్థం అవుతుందని ఎక్కువ ఏకాగ్రత తో చదవాలి. లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల కావాలి సమయాన్ని వృథా చేయవద్దు. ఇక్కడ వాతవరణం అన్నింటికి అనుకూలంగా ఉంది. ఒక ప్రశ్నను సమాధానం భిన్న కోణాలలో ఆలోచించాలి. ఎదైన పూర్తిగా చదివితేనే ప్రశ్నలు, డౌట్లు అడగగలుగుతాం, డౌట్లు ఎక్కువ అడిగితే నే సబ్జెక్ట్ పై ఎక్కువ పట్టు సాధించగలుగుతారు. మీరు ఎంచుకున్న లక్షాలను చేరుకోవాలని అల్ ద బెస్ట్ తెలిపారు.

## ఆటో కార్మికులను ఆదుకోవాలి.

**పెద్దపల్లి, డిసెంబర్ 07 కరపత్రం**



ఆటో డ్రైవర్లు, కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జెఏసి అద్యక్షులు మంద రవి కుమార్ కోరారు. పెద్దపల్లిలో జిల్లాలో శనివారం నిర్వహించిన ఆటోల బంద్ విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆటో సమస్యలపై పరిష్కారం చూపెట్టాలని, లేనియెడల చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట రాజయ్య, అంబాల శంకర్, సదానందం, గాజుల రాజశేఖర్, మట్ట నర్సయ్య, చిలుముల కుమార్, ఎనగందుల నాంపల్లి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం ఆటోల సమస్యలపై పోస్టర్లను ఆవిష్కరించారు.

## విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి




**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 07 కరపత్రం**

హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని కుమ్మరి వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9వ తేదీన జరిగే అంతర్జాతీయ అవినీతి దినోత్సవంను పురస్కరించుకొని " అవినీతి నిర్మూలనలో విద్యార్థుల/ పౌరుల పాత్ర"అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ధనపురి సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అవినీతి ఏ రూపంలో ఉన్న దాన్ని ప్రతిఘటించలి అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు తమ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించాలని అప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 గురుంచి విద్యార్థులకు అవగాహనా కలిపించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోస్, పాల్గొన్న విద్యార్థులకు పెన్నులను బహుమతి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గోగురి శ్రీధర్ రెడ్డి, వి. ఉదయ్, డి. దేవిప్రసాద్, హిమసాయి. ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల మల్లేష్ యాదవ్ సేవలు చిరస్మనీయం.

**- రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్.**



**కరీంనగర్ డిసెంబర్ 7 కరపత్రం**

స్వర్గీయులు ఎన్ బాలమల్లేష్ యాదవ్ కి తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ ఘన నివాళులు అర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం గణేష్ నగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్ లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షత న సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ బాలమల్లేష్ యాదవ్ గతవారం రోజుల కిందట గుండె పోటుతో అకాల మరణం చెందిన బాల మల్లేష్ సంతాప సభ ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ముఅశోక్ యాదవ్ మాట్లాడుతూ స్వర్గీయులు బాల మల్లేష్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపక వృత్తిదారుల సంఘం లో రాష్ట్ర నాయకులుగా పనిచేస్తూ అనేక సేవలు చేశారని ఆయన లేని లోటు సంఘానికి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేస్తూ వారికి పూలమాలవేసి సంతాపం తెలిపి ఘన నివాళులర్పించారు. యాదవుల హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం జరిగిన అనేక పోరాటాల్లో ముందుండి నడిచిన వ్యక్తి అని తెలిపారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు సరైన వాటా రావాలని ఉద్యమాలకు ముందుండి నడిపించినవ్యక్తి అని కొనియాడారు. అన్ని రాజకీయ పార్టీల్లోని బీసీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి సమావేశాలు ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేశారన్నారు. బాల మల్లేష్ ఆశయా సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గం అధ్యక్షులు సందనవేణి ప్రసాద్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జంగం కొమురయ్య యాదవ్, మండలాధ్యక్షులు రాజు యాదవ్, దానవేని రమేష్ యాదవ్, రాజు యాదవ్, ఐలయ్య యాదవ్,
బి.పరశురాములు యాదవ్, రాములు యాదవ్, రాజన్న యాదవ్, గనివేని రాములు యాదవ్, వెంకటేష్, జంగ శంకర్ యాదవ్ ,నన్న వేణి కొమురయ్య యాదవ్ తదితరులుపాల్గొన్నారు.

## ఇండోర్ గేమ్స్ ఏర్పాటు కు కృషి..కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్..

**కరపత్రం కంటోన్మెంట్ డిసెంబర్ 07**



కంటోన్మెంట్ న్యూ బోయిన్ పల్లి పరిధిలోని సీనియర్ సిటిజన్స్ కోసం ఇండోర్ గేమ్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ తెలిపారు. న్యూ బోయిన్ పల్లి లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంపన ప్రతాప్ మాట్లాడుతూ క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ ఇతర ఇండోర్ గేమ్స్ ప్రస్తుతం బోయిన్ పల్లి ప్లే గ్రౌండ్ లో ఉన్న రూమ్ లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం లో భాగంగా ప్రస్తుతం ఉన్న రూమ్ తో పాటు స్థలం అధికారులు తీసుకోనున్నారని తెలిపారు. శాశ్వతంగా సీనియర్ సిటిజన్స్ ఇండోర్ గేమ్స్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్ , మధు, మాల్యాద్రి, బండి శ్రీనివాస్,రాజు, సిరాజ్ పాల్గొన్నారు.

## చిలికేశ్వర ఆంజనేయస్వామి ఆలయ పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**ఉప్పల్ కరపత్రం డిసెంబర్ 07**



చిల్కానగర్ డివిజన్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిలికేశ్వర ఆంజనేయస్వామి దేవాలయాన్ని శనివారంరోజు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆలయ కమిటీ అధ్యక్షులు కృష్ణతో మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు ఎంతో వేగంగా జరుగుతున్నాయని అభినందిస్తూ నిర్మాణంలో భాగంగా ఎటువంటి సహాయ సహకారాలకైన తాను ముందుంటానని వారికి అభయం ఇవ్వడం జరిగింది.

ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇచ్చిన ప్రోత్సాహానికి ఆనందం వ్యక్తపరుస్తూ ఆలయాన్ని వీలైనంత త్వరలో పూర్తిచేసి చిల్కానగర్ డివిజన్ ప్రజలకు అందుబాటులో తెస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పలువురు టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.